క్లుప్తంగా

ఏఐసీసీ సభ్యుడిని కలిసిన దుర్గ

ఖమ్మంవన్‌టౌన్: ఏఐసీసీ సభ్యుడు, రాహుల్ గాంధీ సలహాదారుడు కొప్పుల రాజును కాంగ్రెస్ నాయకుడు మధుగాని దుర్గ బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటోను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలందరికీ అందేలా చూడాలని రాజు సూచించినట్లు తెలిపారు.

30న పైనంపల్లి సొసైటీ ఉపాధ్యక్షుడి ఎన్నిక

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉపాధ్యక్షుడి పదవికి బుధవారం ఎన్నికల అధికారి, సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.శృతి స్థానిక సొసైటీ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతో గత సొసైటీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 12 మంది సొసైటీ డైరెక్టర్లు, చైర్మన్‌తో పాటు 13 మందికి ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఈ నెల 30వ తేదీన నామినేషన్, అదే రోజు ఉపసంహరణ, ఎన్నిక, ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ సంతాపం

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో వాహన డ్రైవర్ విజయ్ మృతికి బ్యాంక్ చైర్మన్ కూరాకుల నాగభూషణం సంతాపం తెలిపారు. మంగళవారం రాత్రి విజయ్ రోడ్డు ప్రమాదంలో మరణించగా.. బుధవారం తల్లాడ మండలం మల్లారానికి చెందిన విజయ్ స్వగ్రామంలో మృతదేహాన్ని చైర్మన్ సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, కుర్నవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

తమ్మినేని నివాళి

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సోదరుడు, జిల్లా కమిటీ సభ్యురాలు బండి పద్మ సోదరుడు నున్నా రమణ సోమవారం గుండెపోటుతో మరణించారు. ఖమ్మంలోని బైపాస్‌రోడ్‌లో గల ఆయన స్వగృహంలో పార్థివదేహాన్ని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గాదె మాధవరెడ్డి, న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు నెల్లిమర్ల ప్రసాద్, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి పరకాల నాగయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

కామేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బానోత్ సునీత అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీలో ఆరోగ్య సేవల పరికరాలు, పలు పనులకు సంబంధించిన అంశాలను తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, వైద్యాధికారి డాక్టర్ చందన, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	సలార్
సాయిరాం	దుంకీ
ఆదిత్య	సలార్
శ్రీనివాస	సలార్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	70		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	80	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	3
దొండ	70		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	70	మెంతికూర	2
క్యాబేజీ	24		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	56	పుదీన	1
క్యారెట్	54		20
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

మంచు.. ప్రమాదపుటంచు


చర్చి కాంపౌండ్ బ్రిడ్జిపై కురుస్తున్న మంచు


అల్లీపురం, కొత్తగూడెం రోడ్డులో..

ఓ వైపు చలి.. మరోవైపు పొగమంచు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో గత రెండ్రోజులుగా చలి తీవ్రంగా ఉంటుంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు రోడ్లను మంచు దుప్పటి కమ్మేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకూ కనించడం లేదు. దీంతో మంచుమాటున దాగిఉన్న మృత్యువు రోడ్డు ప్రమాదాల రూపంలో కాటేస్తోంది. నిత్యం వెళ్లే మార్గమే కదా అని నిర్లక్ష్యం చేస్తే చిక్కుల్లో పడ్డట్టే. ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే పరిమిత వేగంతో ప్రయాణం చేస్తే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని పోలీస్ రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

– ఖమ్మంక్రైం

పొగమంచుతో పొంచి ఉన్న ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం

- రోడ్లను కమ్మేస్తున్న మంచు దుప్పటి
- హెడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తున్న వైనం
- నిత్యం వెళ్లే మార్గమేనని నిర్లక్ష్యంగా నడపొద్దు
- వాహనదారులు తస్మాత్ జాగ్రత్త
- నిర్ణీత వేగంతో ప్రయాణం సురక్షితం

అప్రమత్తంగా ఉండాలి..



మంచు సమయంలో వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. సరైన జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చు. పొగమంచు ఉంటే ప్రయాణాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి. కార్లు నడిపేటప్పుడు సీటు బెల్ట్, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, జర్కిన్లు ధరించాలి.

– వరప్రసాద్, ఎంవీఐ, ఖమ్మం

ప్రయాణం సాఫీగా సాగాలంటే..

లోతట్టు ప్రాంతాలు, చెరువులు, ఎక్కువగా చెట్లు ఉండే తోటలు ఉండే దగ్గర పొగమంచు ఎక్కువగా ఉంటుంది. దూరప్రయాణాలు చేసే వాహనదారులు తెల్లవారుజామున సమయంలో పొగమంచు అధికంగా ఉంటుంది కాబట్టి వాహన హెడ్ లైట్లు వేసుకొని పరిమిత వేగంతో వాహనం నడపాలి. పొగమంచు వల్ల వాహన చోదకులకు పాదచారులు, ఇతర వాహన దారులు సైతం దగ్గరగా వచ్చే వరకూ కనిపించదు. పొగమంచు మరీ ఎక్కువగా ఉంటే ప్రయాణాన్ని ఆపివేయటం మంచిది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. వాహనదారులు భద్రత పాటిస్తేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రోడ్డు స్పష్టంగా కన్పించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనం ఆపివేయటం మంచిది. అది ఇతర వాహనాలకు కన్పించే విధంగా ఉండాలి.
- వాహనాలు నడిపేటప్పుడు ఇతరులకు స్పష్టంగా కన్పించేలా వాహనం లైట్లను ఆన్‌చేసి ఉంచాలి. తక్కువ వేగంతో వాహనాల మధ్య కచ్చితమైన దూరం పాటిస్తూ ప్రయాణించాలి.
- కారు నడిపేటప్పుడు అద్దాలు స్పష్టంగా కన్పించేలా ఏసీ బ్లొజర్ కండీషన్‌లో పెట్టుకోవాలి. బ్రేకులు కండీషన్‌లో ఉండాలి.
- రాత్రివేళ, తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రయాణం వాయిదా వేసుకోవడం మంచిది.
- చలికి చేతులు పటుత్వాన్ని కోల్పోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తప్పనిసరి.
- గంటకు 40 కిలోమీటర్ల వేగానికి మించి ప్రయాణం చేయకూడదు.
- వాహనాల హారన్‌లను వినేందుకు వాహనంలో సంగీతాన్ని నిలిపివేయాలి.
- కార్లు నడిపేటప్పుడు సీటు బెల్ట్, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, జర్కిన్లు ధరించాలి.
- రోడ్డుపై రేడియం లైనింగ్, స్టిక్కర్ల సూచికలు గమనించాలి.
- రహదారి పక్కన వాహనాలు నిలిపి ఉంటే సూచికలు ఏర్పాటు చేసుకోవాలి. మలుపులు, డివైడర్లు కన్పించకపోవటం వల్లే ప్రమాదాలు.
- పొగమంచు సమయంలో వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు.
- వాహనం ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. హెడ్‌లైట్లు, పార్కింగ్ లైట్లు వేసి డ్రైవింగ్ చేయటం వల్ల ముందు, వెనుక వచ్చే వాహనాలకు స్పష్టంగా అర్థమవుతుంది.
- ఈ నియమాలను పాటిస్తే ప్రయాణం సురక్షితం.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని నేలకొండపల్లి ఏఎస్సై కోడేత్రాచు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు కెపాసిటీకి మించి ప్రయాణాలు చేయొద్దని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వొదన్నారు. పోలీస్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా ఇతరత్రా తయారీ, అమ్మకాలపై పోలీసులకు సమచారం అందించి యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నారం సర్పంచ్ మస్తాన్, నేలకొండపల్లి మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, కడియాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై కోడేత్రాచు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు..


విరాళం అందించాక రశీదుతో దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందించారు. తూరపాటి ప్రకాశరావు, చంద్రకళ దంపతులు రూ.10,116లు, గోగం సురేశ్,సత్యశ్రీ దంపతులు రూ.10,116లు, మక్కా ఉపేందర్‌గౌడ్, రజిత దంపతులు రూ.10,116లు, తూరపాటి రవికుమార్, దుర్గ దంపతులు రూ.5,116లు, పెట్ల సురేందర్ సావిత్రి దంపతులు రూ.5,116లు, రామకృష్ణ, సత్యవతి దంపతులు రూ.5,116లను విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు


ఖమ్మం సహకారనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన వికారాబాద్‌లో జరిగిన అండర్–19 కరాటే పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. బుధవారం కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు బి.నితిన్, యు.సుదర్శన్, జి.గణేశ్, ఎస్‌కె.ఖదీర్, జి.విఘ్నేశ్, కె.సాయిచరణ్, ఎస్‌కె.రిజ్వార్, ఆర్.నివాస్‌లను అభినందించారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

కామేపల్లి: మండలంలోని టేకులతండా, పింజరమడుగు గ్రామంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈనేపథ్యాన గురుస్వామి కిషన్ ఆధ్వర్యాన అయ్యప్ప మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఒకేషనల్ బిల్డింగ్ నిర్మించాలి

తిరుమలాయపాలెం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రిండిపోలు జూనియర్ కళాశాలలో ఒకేషనల్ బిల్డింగ్ నిర్మించేందుకు కళాశాలకు రూ.కోటిన్నర మంజూరు చేసినా.. ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదని వెంటనే పనులు ప్రారంభించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలలో సమస్యలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలలో 360 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల కార్యదర్శి వంశీ, నాయకులు సాయి, గోపి, చరణ్, మహేశ్, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మస్తాన్

శోభాయాత్ర..

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో అయోధ్య తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యాన బాల రామ అక్షింతలను బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ అధ్యక్షతన బ్రాహ్మణబజార్, పాత డీఈఓ కార్యాలయం, కమాన్ బజార్, కస్బా బజార్ తదితర ప్రాంతాలలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేషపనిశర్మ, ఓలేటి శ్రీనివాస్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, కుమ్మరికుంట్ల హనుమంతరావు, నాగ, ఆకుల మురళి, గుర్రం నాగేంద్ర, రామకృష్ణ, సుధారాణి, వరలక్ష్మి, విజయ, సరోజిని, రామన్న, లక్ష్మి, మంజుల, స్వాతి, అకిమాముల శ్రీనివాస్, రాధా పాల్గొన్నారు.

ఏదులాపురానికి 'అయోధ్య' అక్షింతలు


అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

ఖమ్మం రూరల్ : మండలంలో ఎదులాపురం గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి అయోధ్య నుంచి రామతీర్థ సేవ ట్రస్ట్ ఆధ్వర్యాన తలంబ్రాలు అందాయి. తొలుత ఏదులాపురం స్టేజ్ నుంచి మహిళలు, భక్తులు, గ్రామ పెద్దలు డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామ పెద్ద దండి సురేశ్, రాజేశ్వరి దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వాటిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మిడకంటి పెద్ద వెంకటరెడ్డి, వెంపటి సురేందర్, ఓరుగంటి శేషగిరి, చెరుకుపల్లి భాస్కర్, వెన్నం భాస్కర్, ఘనపరపు వీరన్న, నాగయ్య, ఎం.శంకర్ రెడ్డి, రమణ, తేనే సాదేవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాట తప్పదు..

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయాన ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి మాట నిలబెట్టుకుంటుందని పాలేరు కాంగ్రెస్ డివిజన్ నాయకులు రావెళ్ల కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్లు ఇస్తామని పదేళ్లుగా బీఆర్‌ఎస్ మోసం చేసిందని అన్నారు. పథకాలను అర్హులందరూ వినియోగించుకునేందుకు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సేవలు అందించాలని కోరారు. గ్రామ సభలపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

'ప్రజాపాలన'పై అవగాహన కల్పించండి

- ప్రజల నుంచి ఏ దరఖాస్తు వచ్చినా స్వీకరించాలి
- సమీక్షా సమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తుల స్వీకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించగా.. అనంతరం డీపీఆర్‌సీ భవనంలో ఉద్యోగులు, సిబ్బందికి దరఖాస్తుల స్వీకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని, డివిజన్ల వారీగా తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అన్ని దరఖాస్తులను నేటి(గురువారం) నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు స్వీకరించబడుతుందన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహర, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు దరఖాస్తులు స్వీకరించనున్న డివిజన్ల వివరాలు..

5వ డివిజన్ జాలాజీనగర్ కేంద్రంలో టి.ధరణికుమార్(7780587720), 6వ డివిజన్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో సీహెచ్.సురేష్‌బాబు(9502812588), 9వ డివిజన్ రోటరీనగర్ వీధివ్యాపారుల ప్రాంగణంలో ఎ.క్రిష్ణాలాల్(9849903607), 10వ డివిజన్ చైతన్య నగర్ పార్క్ వద్ద వి.రంజిత్ (7995075408), 11 వ డివిజన్ సూర్యదేవర ఫంక్షన్‌హాల్‌లో టి.రంగారావు(7901298205), 13వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ, రెజొనెన్స్ స్కూల్ దగ్గర, ఓపెన్ ప్లేస్ వద్ద సీహెచ్.స్వామి (9849906095)లు దరఖాస్తులు తీసుకోనున్నారు. అలాగే 17వ డివిజన్ పాత గీతాంజలి స్కూల్ దగ్గర కె.వికాష్(8008661119), 29వ డివిజన్ ప్రొఫెసర్ జయశంకర్ పార్క్ దగ్గర బి.సత్యనారాయణ(9550615505), 19వ డివిజన్ సంభానినగర్ గిరకభావి సెంటర్ వద్ద రంజిత్‌కుమార్ (9182270695), 24వ డివిజన్ సెయింట్ మేరిస్ స్కూల్ దగ్గర బి.నవీన్ (9640777076) ఆధ్వర్యాన దరఖాస్తులు స్వీకరించనున్నారు.

'సభల' నిర్వహణకు సన్నద్ధం..

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణపై అధికారులు ఆయా మండల ప్రభుత్వ కార్యాలయాలు, రైతువేదికల్లో బుధవారం మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఆరు గ్యారంటీల ఆవశ్యకతను వివరించడంతో పాటు దరఖాస్తుదారుడి ఇంటిగ్రేటెడ్ అప్లికేషన్‌ను స్వీకరించే విధానంపై దిశా నిర్దేశం చేశారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


రఘునాథపాలెం: మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి విజయకుమారి


నేలకొండపల్లి: మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్


తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న తహసీల్దార్ రాంప్రసాద్

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం ఖమ్మంలో కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆప్ మనుగడను, లక్ష్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఉచిత విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల కోసం నిరంతరం పార్టీ పోరాడుతుందని తెలిపి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా స్వర్ణ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా గంధం పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా పసుమర్తి శ్రీనివాస్‌లతో పాటు నియోజకవర్గాల కమిటీలను వేశారు. ఈ సమావేశంలో మాజీ రాష్ట్ర కన్వీనర్ రాముగౌడ్, హేమ, యమున, స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న కార్యకర్తలు

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

కామేపల్లి: రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందని ఓ ప్రైవేట్ సంస్థ చైర్మన్ ఎ.సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ముచ్చర్లలో ఆ సంస్థ ఆరో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సేంద్రియ ఎరువుల వినయోగం వల్ల కలిగే ప్రయోజనాలు, రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఉత్తమ దిగుబడులు సాధించిన రైతులు బత్తుల నారాయణ, బానోత్ శ్రీను, రాయల రాజేశ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సంస్థ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం వైస్ ఎంపీపీ తాత గణేశ్, సంస్థ బ్రాంచ్ మేనేజర్ తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఏబీఎం రాంబాబు, సుమంత్, వీరభద్రం, గోపి, నాగబాబు, ఉపేందర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న సంస్థ చైర్మన్ సత్యనారాయణ

ఎన్నికల ప్రచార వ్యయంపై అభ్యంతరాలు..

- అభ్యర్థులతో సమావేశానికి అధికారుల ఏర్పాట్లు
- రేపు ఎన్నికల వ్యయ పరిశీలకుడి రాక

నేలకొండపల్లి: ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు సమర్పించిన ప్రచార వ్యయాలపై ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు కాకుండా అభ్యర్థులు మూడు దఫాలుగా చేసిన ప్రచార వ్యయానికి సంబంధించిన లెక్కలు నామమాత్రంగా ఇచ్చినట్లు నిర్ధారణకు వచ్చారని తెలుస్తోంది.

ప్రచార వ్యయం రూ.40 లక్షలు..

కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అభ్యర్థులు రూ.40 లక్షల వరకు వ్యయం చేయొచ్చు. ప్రవర్తనా నియమావళి ప్రకారం.. రోడ్ షోలలో వినియోగించిన వాహనాలు, టెంట్లు, ఇతరత్రా వాటికి ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితిని మించి కొంతమంది లెక్కలు అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార వ్యయాలను నిర్దేశించిన గడువులోగా సమర్పించకుంటే ఆరేళ్ల పాటు ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

గడువులోగా సమర్పించేలా కార్యాచరణ..

కేంద్ర ఎన్నికల సంఘం ప్రయోగాత్మకంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అకౌంటింగ్ నిమిత్తం పాలేరు నియోజకవర్గానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అభ్యర్థుల ప్రచార వ్యయాన్ని పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఈనేపథ్యాన అధికారుల రిజిస్టర్, అభ్యర్థుల రిజిస్టర్‌లోని లెక్కలకు పొంతనలేకుండా ఉందని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఈ నెల 29వ తేదీన అభ్యర్థులతో అవగాహన సదస్సు నిర్వహించేందుకు ఎన్నికల వ్యయపరిశీలకుడు కునాల్‌కుమార్ ఖమ్మం రూరల్ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి రానున్నట్లు అధికారులు తెలిపారు.